

కథా కౌముది

# ఆలస్యపు లేఖ ఎం.పద్మావతి

**ఎక్కడ మొదలు పెట్టను?** ముప్పై ఏళ్ళ క్రితం కథా? మూడు నెల్ల క్రితం పరిచయమయిన "పాతకొత్త" కథా? ఎలా చెప్పను నీ ప్రశ్నకు సమాధానం? కానీ రాత్రి నిశ్చయించుకున్నా నీకు సమాధానము యివ్వాలని. రాత్రినుండి యిదే ఆలోచన – రాత్రే ఎందుకంటావా కథ చివరిలో చెపుతా.

పోట్లాటతో కదా మన పరిచయం మొదలయింది. అయితే అది పోట్లాట అని నాకు అప్పుడు అనిపించలేదు. అది ఒక బలీయమయిన స్నేహానికి "నాందిగా" అపుడు నేను భావించా. నీకు కూడా అలాంటి భావమే కలిగి వుంటుందని నేను నమ్మాను. ఆ రాత్రి అంతా మరుసటి రోజు ఉదయం కళాశాలకి సమయము ఎపుడు అవుతుందా అని యెంత ఎదురు చూసానో నీకు తెలియదు, కాదు కాదు ఎప్పటకీ తెలియలేదు. కానీ ఏమయింది? రాత్రంతా నేను ఎదురు చూసింది వేరు, జరిగింది పూర్తిగా వేరు.

"విహంగమై ఎగిరిన మనసు రెక్కలు విరిగిన క్షణాలవి" ఉదయం క్లాసులో అందరి ముందు యెంత దారుణంగా అవమానించావు!?

"ఇప్పటికీ ఆ సంఘటన నన్ను ముళ్ళై గుచ్చుతూనే వుంది." ఎందుకంటే అది నేను చదివిన ఒక ప్రముఖ కవి కవితలా "అర గుచ్చిన బాణం" కదా! అది మొదలు ఆ మూడు ఏళ్ళలో మన చదువు పూర్తయ్యేలోపు ఎన్ని సంఘటనలు మనిద్దరి మధ్యా, కానీ అవన్నీ మన తరగతి వాళ్ళందరి దృష్టిలో తగవులైతే, నా దృష్టిలో మాత్రము అదంతా నీకు నాపై ఉన్న ఒక ప్రత్యేకమయిన దానిని ఏమనాలో తెలియలేదు. ఆ వయసులో అది "ప్చ్" ఏమయినా కానీ అది నీకు నేనంటే "అందరికన్నా ప్రత్యేకం" అన్నది మాత్రం నిజం. కానీ దురదృష్టం ఏమిటంటే అది నాకు తెలుసు, కానీ నీకు మాత్రం తెలియదు. ఏమయినా కానీ అపుడు నేను అర్థము చేసుకున్నది నీకు తెలియ చెప్పాలని చాలా ప్రయత్నించా – ఎందుకంటే "కరిగిపోయే కాలంలో మనం గతంలా మిగిలి పోతామనే భయంతో" కానీ ఏం లాభం? నీ అర్థంకాని తనముతో దాన్ని తగవు కిందే ముగించేవాడివి.

"ఎవరి మనసును అర్థం చేసుకునే వివేకం వారి బుద్ధికి లేకపోయాక ఎవరెన్ని ప్రయత్నాలు చేసిన లాభమేమిటి?" దేని గురించైతే నేను భయపడ్డానో ఆ రోజు వచ్చేసింది. "ఆ అమృత క్షణాల" సమయం అయిపోయి కళాశాల నుండి బయటకి వచ్చే రోజు వచ్చేసింది. నీ స్నేహితుల మధ్య ఉన్న నిన్ను దగ్గరకి వచ్చి పిలిచా! విన్నావు, కానీ విననట్టు నటించావు. భారమయిన మనసుతో వెనుతిరిగా "నీ నుండి శాశ్వతంగా"

కానీ మళ్ళీ ఎవరి జీవితంలో వాళ్ళు ఒదిగిపోయాక నా కూతురు పెళ్ళిలో నా అల్లుడు 'మా మావయ్య' అంటూ నిన్నూ నీ కుటుంబాన్ని నాకు, నా భర్తకు పరిచయం చేసాడు. కానీ ఇన్ని ఏళ్ళ తరువాత నన్ను చూసినపుడు నీ కళ్ళలో "నేను అప్పుడు ఎదురు చూసిన భావం" ఇప్పుడు కనపడింది. నాకు సమాధానం చాలా ఆలస్యంగా అయినా తెలిసింది.

కాదు కాదు ఎన్నో ఒంటరి సమయాల్లో నీ విషయంలో నేను పొరపాటు అర్ధం చేసుకున్నానేమో అన్న నా ప్రశ్నకి నేను "నిజమే" అన్నది నాకు తెలిసింది.

"గతం స్మృతులతోపాటు వాస్తవంలోని బాధ్యతలను పూర్తిచేసాను" పెళ్ళి తతంగం పూర్తయి, నా కూతురు అప్పగింతల కార్యక్రమంలో నా కూతురితోపాటు నేను దుఃఖించిన దుఃఖంలో నీ పాత్ర కూడా వుందని నీకు తెలియదుకదూ! అవును.. ఇప్పుడు కూడా నువ్వు వెళ్ళిపోతున్నావన్న దుఃఖం, నా బిడ్డ పరాయిదయి వెళ్ళిపోతుందన్న బాధ కలగలసిపోయి నన్ను కుదిపివేసింది.

మీరు వెళ్ళిపోయాక చూసా. నన్ను ఒంటరిగా చూసి నువ్వు యిచ్చిన చిన్న కాగితంలోని 'నీ జీవితకాలపు ఆలస్యపు లేఖని' దానిలో "నిన్ను దూరం చేసుకున్నాక తెలిసింది నాకు కావల్సిందేమిటో. కానీ అప్పటికే నీ జీవితం వేరే వ్యక్తితో ముడిపడిపోయిందని తెలిసింది, కానీ ఒకటి చెప్పు నీకు యిదంతా ముందే తెలుసు కదా" అని వుంది. కానీ దానికి సమాధానం నీకు ఏమి చెప్పగలను? నా "ఒంటరి క్షణాలలో నీ పాత్ర గురించి నీకెలా చెపితే అర్ధమవుతుంది?"

నీ ప్రశ్నకు జవాబు నా మనసుకి తెలిసినంతగా నీకు మాటలలో చెప్పడం నాకు రాదు. కానీ రాత్రి నేను చదివిన 'బుచ్చిబాబు'గారి కథ "నన్ను గురించి కథ వ్రాయవూ?" అదే నా సమాధానం. నీకు సమాధానం చెప్పటానికి ఆ మహానుభావుడి కథని వాడుకున్నందుకు ఆయనకు మనసులో క్షమాపణలు చెప్పుకుంటూ 'జీవితకాలం' ఆలస్యంగా చదివిన ఈ కథ నేను అప్పట్లో చదివి వుంటే "నా ఒంటరి క్షణాలలో నీ పాత్ర నాకు భౌతికంగా పక్కనే ఉండేది".

"యిదే నీకు నా సమాధానం"

Click here to share your comments on this story